

# 6. వాషింగ్‌టన్

**పాఠంలోకి ప్రవేశించే ముందు.**

- మనిషి జీవితంలో అతి ముఖ్యమైనది - ప్రతి మనిషి తన పనిని నిజాయితీగా చేయడం - షేక్స్పియర్.
- తన కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించే వ్యక్తి మిగతా అందరికన్నా మిన్నగా ప్రజాసేవ చేయగలుగుతాడు - జవహర్‌లాల్ నెహ్రూ..
- అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో వాషింగ్‌టన్ యొక్క నాయకత్వం గురించి ఉపాధ్యాయునితో చర్చించండి.

శ్రీ నాళం కృష్ణారావుగారు ఈ పాఠంలో వాషింగ్‌టన్ యొక్క సహానుభూతి, నిరాడంబరత, కర్తవ్యనిష్ఠలను వివరించిన తీరును చూద్దాం.

---

పాంథుడొక్కడు పట్టణ పరిసరమున
హయముపై నెక్కి యెచటకో అరుగు చుండె,
ఊరి వెలుపల కొందరు యుద్ధభటులు
త్రోయుచుండిరి బరువైన దూలమొకటి (1)

బలిమియై వారలందఱు పట్టిపెనగి
అదిమి లాగిన దూలంబు కదలదయ్యె
పట్టు, డెత్తుడు, నెట్టుడు, కట్టిలాగు
డంచు నొక్కడు వారి గద్దించుచుండె (2)

పథికుడది చూచి వానితో బలికెనిట్లు
అయ్యా ఇటు చేయుడటు సేయు డంచు నిల్చి
నుడువు కంటెను నీవును నడుము కట్టి
సాయమొనరించి కార్యంబు చేయరాదె? (3)

చుఱుకు చుఱుకున నాతండు చూచి అనియె
"నన్నుకేవల సామాన్య నరుని రీతి
మాటలాడెదు తారతమ్యంబు లేక
ఎవ్వరనుకొంటి? సేనాని జువ్వె యేను" (4)




"అహహా! మీరలంతటి మహామహులటంచు
ఎఱుగ కాడితి నన్ను క్షమింపుడయ్య"
అనుచు తెరువరి మెల్లన హయము డిగ్గి
శక్తి కొలదిని భటులకు సాయపడియె (5)

తోడనే వారు పథికుండు తోడుపడగ
ఎత్తిరవలీల దూల మువ్వేత్తు గాగ
చెంత నిలుచుండె నడుమున జేయివైచి
భూవరుండన దళవాయి ఠీవి మెఱయ (6)

అంత తెరువరి నవ్వుచు నతని కనియె
"అన్న! ఎపుడైన పనియున్న నన్ను పిలువు,
డన్యుడనుగాను, సర్వసైన్యాధిపతిని,
నన్ను పిలుతురు, 'వాషింగుటన్నటంచు." (7)

అంత పడవాలు గ్రక్కు మిక్కనగ లేక
చిత్తరువు రీతి నిలబడి చేష్టలుడిగి
సెల వొసంగుడు పోయివచ్చెద నటంచు
చనియె తెరువరి వేగ నశ్వంబు నెక్కి (8)



ఉ.సూ: అహంకారముతో రాజ్యాలను పోగొట్టుకున్న రాజుల గురించి విద్యార్థులకు తెలియజేయండి.
ఉదా. రావణాసురుడు, ఇంద్రుడు మొదలగువారు.

## I. వినండి-సంభాషించండి.

1. రక్షక భటులు దేశాన్ని రక్షించే విధము.
2. "కొండ యద్దమందు కొంచెమైయుండదా" చర్చించండి

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకుందాం-భావాలను నేర్చుకుందాం.

పాంథుడు = బాటసారి; ఉవ్వెత్తు = మిక్కిలిఎత్తు; హయము - గుఱ్ఱము; భూవరుండు = ప్రభువు; అరుగుచుండె = వెళ్ళుచుండెను; దళవాయి = సేనాని; పెనగి = ప్రయత్నించి; ఠీవి = గాంభీర్యము; గద్దించు = అదలించు; అన్యుడనుగాను = పరాయివాడనుగాను; పథికుడు = బాటసారి; పడవాలు = సేనాని; నుడువుట = చెప్పుట; గ్రక్కుమిక్కనగలేక = మారు మాట్లాడలేక; కార్యంబు = పని; తారతమ్యము = వ్యత్యాసము; చిత్తరువు = బొమ్మ, చిత్రము; చువ్వె = సుమా; ఏను = నేను; చేష్టలుడిగి = కదలిక కోల్పోయి; ఆడితి = పలికితిని; అశ్వంబు = గుఱ్ఱము; తెరువరి = బాటసారి; డిగ్గి = దిగి; అవలీలగా = సులభముగా

1. బాటసారి ఒకడు గుఱ్ఱము పైనెక్కి పట్టణపరిసరము మీదుగా ఎక్కడికో వెళ్ళుచుండెను. పట్టణము బయట కొందరు యుద్ధ భటులు ఒక బరువైన దూలమును త్రోయుటకు యత్నించుచుండిరి.
2. యుద్ధభటులు తమ బలమంతయు ఉపయోగించి ఎంతగా ప్రయత్నించినను ఆ దూలము కదల కుండెను. ఒక వ్యక్తి అచట నిలబడి "పట్టండి, ఎత్తండి, నెట్టండి, కట్టిలాగండి" అని వారిని గద్దించుచుండెను.
3. అది గమనించిన బాటసారి ఆ వ్యక్తితో "అయ్యా! నీవు నిలబడి ఇలా చేయండి, అలా చేయండి అని వారితో చెప్పుటకంటే నీవును పూనుకొని వారికి సహాయపడి ఆ పనిని చేయరాదా!" అని అనెను.
4. ఆ వ్యక్తి బాటసారిని కొఱకొఱ చూచుచు "నన్ను కేవలము సామాన్య మానవునిగా తలచి, వ్యత్యాసమును ఎంచక మాట్లాడు చున్నావు. నన్ను ఎవరనుకున్నావు? నేను సేనానిని సుమా!" అనెను.
5. "ఓహో! మీరు అంతటి మహానుభావులని తెలియక మాటలాడితిని. అయ్యా! నన్ను క్షమించుడు" అని బాటసారి గుఱ్ఱము పైనుండి దిగి తన శక్తికొలది ఆ యుద్ధభటులకు సహాయపడెను.
6. బాటసారి సహాయపడినంతనే భటులు దూలమును సులభముగ పైకెత్తగలిగిరి. సేనాని నడుముపై చేతులుంచుకొని గాంభీర్యము ప్రకాశింప రాజువలె సమీపమున నిలబడియుండెను.
7. ఆ తరువాత బాటసారి చిఱునవ్వుతో సేనానిని చూచి ఎప్పుడైనా పని ఉన్నచో నన్ను పిలవండి. నేను పరాయివాడనుకాను, సర్వసైన్యాధిపతిని. నన్ను 'వాషింగ్టన్' అని పిలుస్తారు" అనెను.
8. ఆ మాటలు విన్న సేనాని మారు మాట్లాడలేక కదలికను కోల్పోయి బొమ్మవలె నిలుచుండి పోయెను. "నాకిక సెలవు ఇవ్వండి, వెళ్ళివచ్చెదనని పలుకుచు" ఆ బాటసారి గుఱ్ఱము నెక్కి వేగముగా వెళ్ళిపోయెను.



### III. కృత్యము: కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.

**(i) అల్లిక పూరించండి.**

| | | |
|---|---|---|
| | ________ | |
| ________ | కదలని దూలాన్ని ఇలా చేయమని సేనాని చెప్పాడు | ________ |
| | ________ | |

**(ii) కింది పదములకు వచనములు మార్చి రాయండి.**

1. భటుడు ________ 2. వారు ________

(ఒకటి నుండి నాలుగు పద్యాలు)

**ఆ. స్వీయస్పందన**

నీవు ఇతరులకు చేసిన సహాయాన్ని నీ సొంతమాటల్లో రాయుము.

**IV. వినండి–చర్చించండి–రాయండి.**

**అ. జవాబులు రాయండి.**

1. బాటసారికి – సేనానికి మధ్య జరిగిన సంభాషణ
2. యుద్ధభటులకు బాటసారి సహాయపడిన విధము
3. సేనాని బొమ్మలా నిలబడడానికి కారణము.
4. దూలాన్ని ఎత్తడానికి యుద్ధ భటులు చేసిన ప్రయత్నాలు.

**ఆ. సరియైన సమాధానాన్ని గుర్తించండి.**

1. దీనిని అవలీలగా ఎత్తారు.
   అ. కర్రను   ఆ. దూలమును   ఇ. స్తంభమును
2. పాంథుడు ఎక్కినది
   అ. హయము   ఆ. రథము   ఇ. గజము

**ఇ. కింది వాక్యాలను ఎవరు ఎవరితో పలికిరి.**

1. "ఎవ్వరను కొంటి? సేనాని జువ్వెయేను"
2. "ఎప్పుడైన పనియున్న నన్ను పిలువు".

**V. స్వీయవ్యక్తీకరణ**

1. బాటసారికి సేనానికి మధ్య జరిగిన సంభాషణను మీ సొంత మాటల్లో రాయండి.
2. వాషింగ్‌టన్ గూర్చి సొంతమాటల్లో రాయండి.

**VI. భాషావగాహన**

**అ. వ్యతిరేక పదాలు రాయండి.**

1. అకార్యము x ______   2. లోపల x ______   3. తేలికైన x ______   4. మెల్లగా x ______

**ఆ. పదాలను కలిపి రాయండి.**

1. బరువు + ఐన   2. వారలు + అందఱు   3. దూలము + ఒకటి   4. పలికెను + ఇట్లు

**VII. సృజనాత్మకత**

గర్వము వల్ల సామ్రాజ్యాన్ని కోల్పోయిన దుర్యోధనుని కథను అంతర్జాలంలో నుండి గ్రహించి రాయండి. (సంక్షిప్తంగా)

**VIII. లేఖన నైపుణ్యాలు: ప్రకటన**

ప్రియదర్శిని పాఠశాల విద్యార్థుల విహారయాత్ర

కింది సమాచారాన్ని చదివి ప్రకటన తయారు చేయండి.

తేదీ : 08.12 2018
చిరునామా : కేశవ సృష్టి, భయందర్
విషయం : విహార యాత్ర
రుసుం : 200 రూ..లు
సమయం : ఉదయం 7.00 నుండి సాయంత్రం 6.00 గం..లు



**నేనివి నేర్చుకున్నా:**

ఎంతగొప్ప పదవికి వెళ్ళినా వినయ విధేయతలను కలిగి ఉండాలి.

9HSYE5